# ప్రేమించుకో

యం. ఓ. యస్దాన్



ఎప్పటిలాగే తంచనుగా తొమ్మిది గంటలకు జగదీష్ ఇంటికొచ్చాడు గోపి. వాళ్ళిద్దరూ ఫ్యామ్లీ ఫ్రెండ్స్. జగదీష్ పిల్లలను గోపి రోజు ఆఫీసుకి వెళుతూ వెళుతూ స్కూల్‌లో దింపేసి వెళుతుంటాడు. తనకు ఎన్ని ముఖ్యమైన పనులున్నా ఈ విషయాన్ని మాత్రం మరచిపోడతడు. ఎందుకంటే ఆ పిల్లలు చదివే స్కూల్‌లో సీత అనే ఓ టీచరుంది. ఆమెను గోపి ప్రేమిస్తున్నాడు. పిల్లలను స్కూల్‌లో దింపే వంకతో సీతను చూడొచ్చు మాట్లాడొచ్చు. అది అతని ప్లాన్. గోపీని చూస్తూనే జగదీష్ భార్య లావణ్య నవ్వుతూ పలకరించింది. "ఏంటొదినా పిల్లలింకా రెడీ కాలేదు?" అడిగాడు గోపి.

"ఈరోజు నువ్వు శ్రమ పడక్కరలేదు గోపి. మేము మా బాబాయి ఇంటికి వెళుతున్నాము. ఇవాళ పిల్లలు స్కూలుకి రారు".

పిడుగుపడినట్టు అదిరిపడ్డాడతను. అప్పటి వరకూ ఉత్సాహంగా ఉన్న అతని మనసులో ఈమాట వినడంతో నిరాశ అలుముకుంది. ఈరోజు సీతతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలనుకున్నాడు. ఇప్పుడు పిల్లలు రాకపోతే సీతతో మాట్లాడే అవకాశం లేనట్టే!

"సరే అయితే నేను వెళ్ళొస్తానొదినా" అంటూ బయటకు నడిచాడు. అతను గేటు దాటక ముందే "గోపి" అంటూ వెనుక నుంచి లావణ్య పిలిచింది.

వెనుదిరిగి ఇంట్లోకి వెళ్ళాడు గోపి.

"ఇఫ్ యూ డోన్ట్ మైండ్ స్కూల్ ఫీజు కట్టేస్తావా?" డబ్బులిస్తూ అడిగింది లావణ్య.

నిరాశ అలుముకున్న అతని వదనంలో మళ్ళీ ఉత్సాహం తొంగి చూసింది.

"విత్ ప్లెజర్ వదినా" అంటూ డబ్బులు తీసుకొని హుషారుగా స్కూల్ వైపు కదిలాడు.

* * *

పినాకిని తీరాన ఉన్న తిక్కన పార్కులో సీత కోసం నిరీక్షిస్తూ నిలబడి ఉన్నాడు గోపి.

ఉదయం ఫీజు కట్టేదానికీ స్కూలుకి వెళ్ళినప్పుడు సీతను "సాయంత్రం పార్క్‌కు రా నీకోసం ఎదురుచూస్తుంటాను" అన్నాడు. ఆమె మౌనంగా ఉండిపోయింది. మౌనం అర్ధాంగీకారం

ఆటోలో వచ్చేశాడు.

బస్ స్టాప్ చూసుకొన్నాడు సమయం ఆరు దాటింది. ఉదయభానుడు అలసటగా పశ్చిమ దిక్కున జారిపోతున్నాడు. వెన్నెమ్మ ప్రశాంతంగా ప్రవహిస్తోంది.

ఆ వాతావరణాన్ని చూపులతో మనసులో నింపుకుంటూ గేటు వైపు చూశాడు. ఆమె ఆటో దిగుతూ కనిపించింది. ముందు సీతే అనుకున్నాడు. కొంచం దగ్గరైనాకా చూస్తే తెలిసింది. ఆమె సీత కాదు, వాళ్ళ అక్క రేణుమతి!

ఆమె సరాసరి అతని వద్దకు వచ్చి "గోపీ అంటే నువ్వేనా?" అడిగింది.

ఔనన్నట్టు తలాడించాడు.

"సీతనెందుకు పార్కుకు రమ్మన్నావూ?" సూటిగా అడిగింది.

ఆమె ఇక్కడకు రావడమే అతన్ని ఆశ్చర్యంలో ముంచెత్తితే మళ్ళీ ఇంత సూటిగా అలా అడిగేసరికి ఏం చెప్పాలో అర్థం కాక నీళ్ళు నమిలాడు.

"మీదేం కులం?" అడిగింది.

మరింత బిత్తరపోయి దిక్కులు చూస్తూ నిలబడ్డాడు.

"మీరేం కులస్థులంటే చెప్పవేం తెలియదా?" వ్యంగ్యంగా అంది.

దాంతో అతనికి కోపమొచ్చి "బెస్తనాయుళ్ళం" సీరియస్‌గా అన్నాడు.

"మాదేం కులమో తెలుసా?"

"తెలుసు"

"తెలిసీ ఒక బ్రాహ్మణ అమ్మాయి వెంట ప్రేమా దోమా అంటూ తిరగడం తప్పు కదూ?"

"................"

"జరిగిందేదో జరిగిపోయింది. ఇక ఇంతటితో ఈ విషయాన్ని మరచిపోయి సీత వెంటపడటం మానుకో. మా కుటుంబం గురించి నీకు పూర్తిగా తెలిసినట్టు లేదు. ఆ తరువాత నీ ఇష్టం." అంటూ విస విసా వెళ్ళిపోయింది.

✻ ✻ ✻

మైత్రీ సంఘం సమావేశానికి హాజరైనాడు గోపి. ఆ సంఘంలో సభ్యుడతను. ఆ ఏరియా ఎస్.ఐ. శ్రీనివాస్ శాంతి భద్రతల గురించి, దానికై సభ్యులు చేయాల్సిన కృషి గురించీ, సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్నాడు.

గోపి, శ్రీనివాస్ చెబుతున్నది వింటున్నాడు కానీ మనసు లగ్నం చేయలేకపోతున్నాడు. రేణుమతి పార్కులో తనను హెచ్చరించాక నేరుగా ఈ సమావేశానికి వచ్చాడతను.

ఎప్పుడూ ఉత్సాహంగా తను చెబుతున్నది వినే గోపిని ఏదో లోకంలో ఉండడం శ్రీనివాస్ గమనించాడు. గోపి అంటే ఎందుకో ప్రత్యేకమైన అభిమానం అతనికి. అందుకే సమావేశం ముగిశాక సభ్యులందరితోపాటు గోపి కూడా వెళ్ళిపోతుంటే అతన్ని పనుంది ఉండమన్నాడు శ్రీనివాస్.

గోపిని వెంటబెట్టుకుని క్యాంటిన్‌కు వెళ్ళి చాయ్‌కు ఆర్డరిచ్చి గోపి కళ్ళలో సూటిగా చూస్తూ విషయం ఏమిటని అడిగాడు. ముందు "ఏమిలేదే" అంటూ బుకాయించాడు గోపి. కాని శ్రీనివాస్ గట్టిగా అడిగేసరికి చెప్పక తప్పలేదు.

"నేనో అమ్మాయిని ప్రేమిస్తున్నాను".

"వెరిగుడ్...! మరలా డల్‌గా ఉన్నావేమిటి? ఇద్దరికీ ఎదన్నా విషయంలో గొడవ జరిగిందా?"

గోపి మౌనంగా ఉండిపోవడంతో మళ్ళీ శ్రీనివాస్ అన్నాడు "విషయమేమిటో చెప్పు. నా చేతనైన సహాయం చేస్తాను".

భారంగా నిట్టూర్చి అన్నాడు గోపి "మా డ్రామా పెళ్ళిగా రూపుదిద్దుకునే అవకాశం కనిపించడం లేదు"

"ఎందుకనీ? నీది వన్ సైడ్ లవ్వా?"

"అదేంకాదు. ఆ అమ్మాయికీ కూడ నేనంటే ఇష్టమే కాని, మా ఇద్దరి కులాలు వేరు కావడం వల్ల ఆమె పెద్దోళ్ళు మా పెళ్లికి ఒప్పుకోరని ఆమె భయపడుతోంది".

పెద్దగా నవ్వాడు శ్రీనివాస్.

"ఈ కంప్యూటర్ యుగంలో ప్రపంచమంతా గ్లోబల్ విలేజ్‌గా ఏకమౌతుంటే ఇంకా మనుష్యుల మధ్య కులాలు అడ్డుగోడలుగా నిలవడం ఆశ్చర్యంగా లేదూ" అంటూ చాయ్ అందుకున్నాడు శ్రీనివాస్.

ఇద్దరూ మౌనంగా చాయ్ త్రాగడం పూర్తి చేశారు. శ్రీనివాస్ సిగరెట్టు వెలిగిస్తూ అడిగాడు. "ఇంతకీ ఆ అమ్మాయి ఎవరు?" గోపి రెండు క్షణాలు ఆలోచించాడు, చెబితే దాని పరిణామం ఎలాగుంటుందో! సరే ఏది జరిగితే అది జరగనీ చూద్దాం అనుకుంటూ ఊపిరి బిగబట్టి అన్నాడు.

"నేను ప్రేమిస్తున్న అమ్మాయి మరెవరో కాదు మీ మరదలు సీత!"

✻ ✻ ✻

"సీతా! నీ వెంట ఎవరో రోడ్ సైడ్ రోమియో పడుతున్నాడంట కదా? మీ అక్కయ్య చెప్పింది. నిన్న వాడ్ని పట్టుకొని లాకప్‌లో వేసి నా లాఠీ రుచి చూపించాను. ఇక జన్మలో నీ జోలికే కాదు ఏ ఆడపిల్ల వైపు కూడా కన్నెత్తి చూడడు. రాస్కెల్" అన్నాడు శ్రీనివాస్.

అదిరిపడింది సీత.

"ఏమిటి బావ నువ్వు చెబుతున్నది గోపి గురించా తను నా వెంట పడుతున్నాడని అక్కయ్య చెప్పిందా?-

ఎంత పని చేశావు బావా! గోపి అలాంటి వాడు కాదు. నేను కంప్యూటర్ క్లాసుకు వెళ్ళినప్పుడు అక్కడ నాకంటే సీనియర్ అయిన అతను ప్రోగ్రామింగ్ గురించి నాకు వివరించేవాడు. అలా అతనితో పరిచయం అయింది. ఆ పరిచయంతో ఎక్కడన్నా కనబడినప్పుడు పలకరిస్తుంటాడు. అంతకు మించి అతనేం ఎరుగడు బావా".

బాధగా అంటున్న మరదలి ఫీలింగ్స్ ఓరకంట గమనించాడు. ఆమె కంట్లో నీటి తెర అతని చూపు దాటి పోలేదు. అప్పుడే అక్కడకు రేణుమతి వచ్చింది.

"ఏమిటండి మీరు చెబుతున్నది? నేనప్పుడే చెప్పాను కదా.... ఇందులో మనదాని తప్పు కూడా ఉందని. ఇది ఇచ్చిన చనువు వల్లే కదా వాడు స్కూల్‌లో నేనున్న సంగతి పట్టించుకోకుండా, దీన్ని పార్క్‌కి రమ్మన్నాడు. వాడు వెళ్లిన తరువాత దీన్ని నిలదీస్తే తమ లవ్ స్టోరీ చెప్పింది.

నాన్నగారి విషయం మీకు తెలియందేముంది. ఈ విషయం ఆయనకు తెలిస్తే ముందు దీన్ని చంపేస్తారు. అందుకే దీన్ని చీవాట్లు పెట్టి దీని బదులుగా పార్కుకు నేను వెళ్లి వాడ్ని దులిపేసి వచ్చాను.

ఆ విషయం మీతో చెప్పానేకాని, మళ్లీ మిమ్మల్ని పనిగట్టుకొని వెళ్లి వాడ్ని కొట్టమన్నానా? రేపు మీమీద కోపంతో అతను దీనిపై ఏదన్నా అఘాయిత్యం చేస్తే ఎవరు బాధ్యులు?

అనవసరంగా ఎస్.ఐ. నన్ను కొట్టాడంటూ అతనెళ్ళి మీపై అధికారులకు రిపోర్టిస్తే ఏమౌతుందో ఆలోచించారా? కోపంగా అంటున్న భార్య వైపు నవ్వుతూ చూస్తూ అన్నాడు శ్రీనివాస్.

"స్త్రీ ఆలోచించినంతదూరం పురుషుడు ఆలోచించడు రేణు. అందుకే తరచూ పొరపాట్లు చేస్తుంటాడు. బట్ నీ భర్త ఆ టైపు పురుషుడు కాదు. అందుకే బాగా ఆలోచించి నేనో నిర్ణయం తీసుకున్నాను".

"ఏమిటది?" కుతూహలంగా అడిగింది రేణుమతి.

దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడతను. "జరిగిన దాంట్లో ఇద్దరి తప్పు ఉంది కనుక ఇద్దరినీ శిక్షించాలి. ఆ శిక్ష వారు జీవితాంతం అనుభవించాలి".

అక్కా చెల్లెళ్ళిద్దరూ శ్రీనివాస్ వైపు అర్థం కానట్లు చూశారు.

"అర్థం కాలేదా? అదేనోయ్ ఇద్దరికీ పెళ్ళి చేసెయ్యాలి" అంటూ పెద్దగా నవ్వాడు.

ఆ మాటతో సీత అక్కడి నుంచి సిగ్గుపడుతూ వెళ్లిపోయింది. రేణుమతి మాత్రం భర్త వైపు కోపంగా చూస్తూ అంది.

"మీకేమన్నా మతిపోయిందా? నాన్నగారి



పయోజన వాచకాలను ఆవిష్కరిస్తున్న డా॥ దక్షిణామూర్తి, ప్రక్కన రచయిత షేక్ అబ్దుల్ హకీంజాని, జేమ్స్ మోర్లే, జోస్ సెబాస్టియన్ గార్లని చిత్రంలో చూడవచ్చు.

## పయోజన వాచకాల ఆవిష్కరణ

ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీం జాని వివిధ అంశాలపై పయోజనుల కోసం రచించిన పన్నెండు వాచకాలను గుంటూరు జిల్లా తెనాలిలో చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ఆవిష్కరించారు. ఈసందర్భంగా పుస్తకాల రచయిత హకీంజాని మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని కల్పించిన గ్రంథాలయోద్యమ ప్రముఖుడు వెలగా వెంకటప్పయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తెనాలి మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ ప్రిన్సిపాల్ జేమ్స్‌మోర్లే, కరస్పాండెంట్ జోస్ సెబాస్టియన్ పాల్గొని రచయితను అభినందించారు. బి.ఏ., బి.యిడి., చదివిన హకీంజాని గత పదేళ్ళల్లో ఆంధ్ర రాష్ట్రంనుండి వెలువడుతున్న అనేక దిన, వార, మాస పత్రికలకు వ్యాసాలు రాయగా 700లకు పైగా ప్రచురించబడినాయి. **(ఒ.వి)**

గురించి తెలిసీ కూడ మీరు వాళ్ళకు వంతపాడుతున్నారా?"

శ్రీనివాస్ ఆమె దగ్గరకొచ్చి ఆమె భుజాలమీద చేయి వేసి ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"మారుతున్న కాలంతో మనుషులూ మారాలీ. లేదంటే ఈ భూమి మీద మానవత్వం మాయమైపోతుంది...! ప్రేమ శక్తి ముందు చరిత్రలో రారాజులే తలలు వంచారు. వాళ్ళకంటే మీ నాన్న గొప్పవాడు కాదు, అతీతుడు అంతకంటే కాదు."

అలా అంటున్న భర్త వైపు అబ్బురంగా చూసిందామె.

* * *

గుడి నుంచి ఇంటికొస్తున్నారు సుదర్శనశాస్త్రిగారు. పరుగు పరుగున ఆయనకు ఎదురొచ్చిన కానిస్టేబుల్ రొప్పుతూ అన్నాడు.

"శాస్త్రిగారు మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకొంది - ఎస్.ఐ. గారు హాస్పటల్‌లో ఉన్నారు. మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు".

అతనేమంటున్నాడో ఒక్క క్షణం శాస్త్రిగారికి అర్థం కాలేదు. అర్థమైన వెంటనే ముఖం వరదలా పొంగుకొచ్చింది. మారు మాట్లాడకుండా హాస్పిటల్ చేరుకున్నారాయన.

హాస్పిటల్‌లో గోడకానుకుని మౌనంగా నిలబడి ఉన్నాడు శ్రీనివాస్.

"ఏమయిందిబాబు? మీ కానిస్టేబుల్ ఏదేదో వాగుతున్నాడు. ఇదంతా అబద్ధం కదూ?" బేలగా అడిగారాయన.

భారంగా నిట్టూర్చి అన్నాడు శ్రీనివాస్.

"వాగడం కాదు మావయ్య మన సీత ఆత్మహత్య చేసుకుంది. వాళ్ళ ప్రేమ విషయం నేను మీకు ముందే చెప్పాను, కానీ మీరు కులాల ప్రసక్తి తెచ్చి నాపై, సీతపై విరుచుకుపడ్డారు.

దాన్ని చంపనైనా చంపుతాను కాని ఆ తక్కువ కులం వాడికిచ్చి కన్యాదానం మాత్రం చేయనన్నారు. మీ మొండితనం తెలిసిన సీత అటు మీకు ఎదురు చెప్పలేక ఇటు మనసునూ, ప్రేమనూ చంపుకోలేక తనే ప్రాణం తీసుకుంది.

ఆ విషయం తెలిసిన గోపి గుండె పగిలి తను కూడా చావుతో సీత పక్కన చేరాడు."

అంటూ పక్కనున్న శవాలను చూపించాడు. నిండుగా కప్పి ఉన్న శవాల వద్దకు వెళ్లి బోరున ఏడ్చేశారు శాస్త్రిగారు. "అమ్మా సీత ఎంత పని చేశావమ్మా నీ మాటను కాదన్నందుకు నాకు ఇంత పెద్ద శిక్ష విధించావా తల్లీ..."

ఆయన భుజంపై అనునయంగా చేయివేశాడు శ్రీనివాస్. అతని చేతిపై అలాగే తల ఆన్చి-

"అందరూ అనుకున్నట్టు నేను మొండివాడ్ని కాదు బాబు, మూర్ఖుడ్ని. అందుకే కులాల ప్రసక్తి తెచ్చి నా కన్నబిడ్డ ప్రాణం తీసుకొనేందుకు కారకుడ్ని అయ్యాను. ఏదో కుర్రతనంలో ఆకర్షణను ప్రేమని భ్రమిస్తోంది అనుకొని అలా మాట్లాడాను కాని - అది ప్రేమకోసం నిజంగా తన ప్రాణాలు తీసుకొంటుందని కలలో కూడ అనుకోలేదు బాబు.

అలా నేను ఊహించివుంటే అప్పుడే దాని పెళ్లి అది కోరుకున్న వాడితో జరిపించి ఉండేవాడ్ని, దాని ప్రాణం కంటే నాకు కులం ముఖ్యం కాదు బాబు" అంటూ కుప్పకూలిపోయారాయన.

* * *

బెడ్ మీదున్న శాస్త్రిగారు మెల్లగా కళ్ళు తెరిచారు.

ఎదురుగా సీత, గోపి, శ్రీనివాస్, రేణుమతీ నిలబడి ఉన్నారు! శాస్త్రిగారి ఆశ్చర్యానికి అంతులేదు. తనేమన్న కల కంటున్నాడా అనుకున్నారు.

ఆయన భావాలను పసిగట్టిన శ్రీనివాస్ ఆయన వద్దకు వచ్చి "నన్ను క్షమించండి మావయ్య ప్రేమకంటే కులం గొప్పది కాదన్న విషయం మీకు తెలియాలనే నేనీ నాటకం ఆడాను. కానీ మీరింతగా రియాక్ట్ అవుతారని నేనూహించలేదు. థ్యాంక్ గాడ్ వర్రీ కావాల్సిన విషయమేమీ లేదు. మీ ఆరోగ్యానికేం ఫరవాలేదని డాక్టరుగారన్నారు."

శాస్త్రిగారు సీతను రమ్మన్నట్టు సైగ చేశారు. భయంగా తండ్రి వద్దకు వచ్చిందామె. ప్రేమగా ఆమె తల నిమిరి నుదుటి మీద చుంబించారాయన.

అక్కడే వాళ్ళందరూ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీనివాస్ పక్కన నిలబడ్డాడు గోపి. ఇద్దరి వైపు గర్వంగా చూశారు శాస్త్రిగారు. మగబిడ్డలు లేని శాస్త్రిగారికి ఇద్దరు కొడుకులు ఉన్నట్టు అనిపించి చిన్నగా నవ్వారు. సంతోషాన్ని పట్టలేక గోపి కూడా నవ్వాడు.

గోపి పక్కనున్న శ్రీనివాస్ మెల్లగా గోపితో అన్నాడు.

"మావయ్యగారి పర్మిషన్ లభించింది. ఇక నిర్భయంగా ప్రేమించుకో.... త్వరలోనే నిన్ను సీతనూ పెళ్ళి మంటపంలో అగ్నిసాక్షిగా విచారించి పూజారిగారు విధించే శిక్ష ప్రకారం శోభనపు సెల్‌లో బంధించేస్తాను"

అతని మాటలకు నవ్వుతూ కొంటెగా సీత వైపు చూశాడు గోపి ఆమె ఇదేం పట్టించుకోకుండా తండ్రి కాళ్ళు పడుతోంది!